ముగిసిన బుల్లితెర కళాకారుల
ఎన్నికల పోలింగ్


ఓటు వేస్తున్న ఎంఎస్ భాస్కర్

అడయార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తమిళ బుల్లితెర నటీనటుల సంఘం ఎన్నికల పోలింగ్ ఆదివారం ప్రశాతంగా ముగిసింది. సుమారు 2 వేల మంది సభ్యులున్న ఈ సంఘం ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ నెలకొంది. అధ్యక్ష పదవికి శివన్ శ్రీనివాసన్ సారథ్యంలోని బృందం, దినేష్ సారథ్యంలో మరో బృందం, భరత్ కళ్యాణ్ సారథ్యంలో మరో కమిటీ, ఆర్తి గణేశన్ నాయకత్వంలో ఇంకో బృందం పోటీ చేశాయి. ఎన్నికల్లో మొత్తం 1652 మంది సభ్యులు ఓటు వేసేందుకు అర్హులుగా ప్రకటించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి విరుగంబాక్కంలోని ఏకేఆర్ కల్యాణ మండపంలో పోలింగ్ ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో నళిని, వైజీ మహేంద్రన్, బోస్ వెంకట్, ఎంఎస్ భాస్కర్, నిరోషా ఎలిజబెత్, జీవా రవి, రోబో శంకర్, కూల్ సురేష్, భువనేశ్వరి, ధారణి, జయలక్ష్మి, వత్సలా, గాయత్రి, అళగప్పన్, మీనా కుమారి వంటి పలువురు బుల్లితెర ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సాయంత్రం 5 గంటలకు పూర్తి కాగా, పూర్తి స్థాయి ఫలితాలు సోమవారం ఉదయానికి వెలువడతాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు. ఇదిలావుండగా ఎన్నికల్లో నటి రవీనాను ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారి అనుమతించలేదు. దీంతో ఆమె తీవ్ర నిరాశకు లోనయ్యారు.


ఓటు వేసిన ఆనందంలో నటీమణులు

కోరిన వరాలిచ్చే కల్పవృక్షం,
పవిత్రగ్రంథం భగవద్గీత

● అవధాని కోట రాజశేఖర్


అవధాని కోట రాజశేఖర్-గిరిజాకుమారి దంపతులకు సత్కారం

ప్యారీస్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత ఏమి కోరుకున్న ప్రసాదించే కల్పవృక్షమని ఆంధ్రప్రదేశ్ నెల్లూరుకు చెందిన సంపూర్ణ వాల్మీకి రామాయణం ఆడియో కర్త, ఆవధాని కోట రాజశేఖర్ అభివర్ణించారు. టి.నగర్‌లోని పప్పిచెట్టి రఘువయ్యచెట్టి ఛారిటీస్ (పీఆర్‌సీసీ) 'సాధన' నెలవారి కార్యక్రమంలో భాగంగా ఆదివారం పీఆర్‌సీసీ సెంటినరీ హాలులో 'గీతారామం' అంశంపై కోట రాజశేఖర్ ప్రవచించారు. కృష్ణపరమాత్మ ఉపదేశించిన గీతాసారం కలియుగంలో మానవులంతా ఆచరణయోగ్యమని ఆయన తెలిపారు. వాల్మీకి రామాయణంలోని శ్లోకములు, భక్త రామదాసు రచించిన దాశరథి శతకంలోని పద్యాలను వీనుల వినిపించి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నారు. ప్రవచన కర్త కోట రాజశేఖర్-గిరిజాకుమారి దంపతులను పీఆర్‌సీసీ ట్రస్ట్ సభ్యులు కోట సుధాకర్, కేకే బాలు, వైవీ హరికృష్ణ, ఉమ్మిడి సుధాకర్, హరిప్రసాద్, సత్యనారాయణ, గోరంట్ల బాలాజీ శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారికి చివరగా ప్రసాదాలు పంపిణీ చేశారు.

అరూర్ అభయారణ్యంలో మావోల సంచారం?

ప్యారీస్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా అరూర్ ప్రాంతంలోని అభయారణ్యంలోవున్న చెట్లపై ఉత్తరాది భాషతో అక్షరాలుండటం గుర్తించిన పోలీసులు ఇది మావోయిస్టుల పని అయివుంటుందని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. అరూర్ సమీపంలోని పోయియపట్టి, కీలనూర్ గ్రామం సమీపంలో ఉన్న చెట్లపై తెలియని భాషలో అక్కడక్కడ రాసి ఉండడం గుర్తించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అధికారులు ఆ చెట్లను పరిశీలించి చెట్లపై అర్థంకాని భాషల్లో ఎవరు రాశారు? అన్నదానిపై విచారణ చర్యలు చేపట్టారు. అటవీ శాఖ అధికారులిచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన సత్యమంగళం టాస్క్‌ఫోర్స్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణలో గుర్తుతెలియని వ్యక్తులు కీలనూర్ సమీపంలోని కోతనంపట్టి గ్రామం గుండా అడవిలోకి ప్రవేశించినట్లు తేలింది. ఇది నిషేధిత నక్సలెట్ల ఉద్యమంలో ఉన్న సభ్యుల పనా? లేదా మరెవరికైనా సంబంధాలున్నాయా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.


చెట్టుపై రాసి ఉన్న అక్షరాలు

రాష్ట్రంలో కమల వికాసం ఎలా ?

● అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నేతల కసరత్తు


వేదికపై బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై రహస్య మంతనాలు

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఆ మేరకు అన్ని పార్టీల కంటే ముందుగా బీజేపీ ప్రాంతీయ పార్టీ అన్నాడీఎంకేతో పొత్తుకుదుర్చుకుని ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలే రాష్ట్రంలో పర్యటించి అనధికారికంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అమిత్‌షా రాష్ట్ర బీజేపీ నేతలు, ప్రముఖులు, కార్యకర్తలతో సమావేశమై అసెంబ్లీ ఎన్నికలలో గెలిచేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు గురించి వివరించారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ రాష్ట్రశాఖను శాసనసభ ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఆ పార్టీ జాతీయ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పీఎల్ సంతోష్ నగరానికి వచ్చి, పార్టీ రాష్ట్ర నాయకులతో భేటీ అయ్యారు. ఆ తర్వాత టి.నగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం కమలాలయంలో ఆదివారం ఉదయం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అధ్యక్షతన పార్టీ నేతల సమావేశం ఏర్పాటైంది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై, మహిళావిభాగం జాతీయ కార్యదర్శి వానతి శీనివాసన్, మాజీ గవర్నర్ తమిళిసై, సీనియర్ నేతలు హెచ్ రాజా, పొన్ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. కొద్ది రోజుల క్రితం రాష్ట్రంలో వివిధ విభాగాలకు బీజేపీ కొత్త కార్యవర్గాలను జాతీయ కమిటీ ప్రకటించింది. రాష్ట్రంలో పలు జిల్లాశాఖ నేతలు కూడా హాజరయ్యారు. ఈ సమావేశంలో సంతోష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం, ప్రత్యర్థుల అంచనాలను తలకిందులు చేసేలా అనుసరించాల్సిన వ్యూహాలు వివరించారు. ఇదే రీతిలో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ నేతలు కూడా సూచనలు చేశారు. ఈ సమావేశానంతరం బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడొకరు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నాడీఎంకే, బీజేపీ కూటమిని మరింత పటిష్ఠం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చలు జరిగాయన్నారు. అలాగే కూటమిలోకి పీఎంకే, డీఎండీకేని చేర్చుకునేందుకు చేసే ప్రయత్నాలు గురించి కూడా చర్చించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై, కేంద్రమంత్రి అన్నామలై ఒకే కారులో కమలాలయానికి వచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న నేతలందరికీ మహిళా నాయకులు రాఖీలు కట్టారు.


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

నిర్బంధ బోధనా మాధ్యమంగా తమిళం

● పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి డిమాండ్



చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమిళభాషను నిర్బంధ బోధనా మాధ్యమంగా అమలు చేయకపోతే నూతన విద్యావిధానం సత్ఫలితాలివ్వదని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల పాటు తీవ్ర కసరత్తు చేసి, యేడాది పాటు బుట్టదాఖలైన విద్యావిధానం ఫైలును దుమ్ముదులిపి విడుదల చేసిందని విమర్శించారు. అమలులో ఉన్న కొన్ని పథకాలకు కొత్త రంగు పులిమినట్లుగా ఉందని, 11వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రద్దు చేయడం సమంజసమే అయినప్పటికీ తమిళభాషను నిర్బంధ బోధనా మాధ్యమంగా ప్రకటించకపోవడం గర్హనీయమన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2020లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యావిధానంతో పోటీపడేలా రాష్ట్రానికి ప్రత్యేకంగా విద్యావిధానం రూపొందిస్తానని గొప్పలు చెప్పుకున్న సీఎం స్టాలిన్ తమిళభాషాభివృద్ధికి పటిష్టమైన అంశాలను ప్రతిపాదించలేదని ఆరోపించారు. రిటైర్డ్ జడ్జి డి.మురుగేశన్ నాయకత్వంలోని కమిటీ ఏర్పాటైనప్పటికీ, కమిటీ సభ్యులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయలేకపోయారని, వారి సూచనలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గత యేడాది జూలై ఒకటిని జస్టిస్ డి. మురుగేశన్ తన నివేదికను సమర్పించారని, ఆ నివేదికలోని అంశాలపై విద్యావేత్తలు, అధ్యాపకులు, మేధావుల అభిప్రాయాలను సేకరించకుండా యేడాదిపాటు బుట్టదాఖలు చేశారని అన్బుమణి విమర్శించారు. 2006 లో ప్రకటించినట్లుగా రాష్ట్రంలో నిర్బంధ తమిళాన్ని ఈ విద్యావిధానంలో ప్రతిపాదిస్తారని అందరూ ఎదురు చూశారని, 12వరకు నిర్బంధ తమిళాన్ని అమలు చేస్తుందని భావించారని, అయితే ఈ కీలకమైన అంశం జోలికి పోకుండా నివేదికను అరకొరగా రూపొందించారని పేర్కొన్నారు. నూతన విద్యావిధానంలో తమిళభాషను నిర్బంధ బోధనా మాధ్యమంగా ప్రకటించి ఉంటే తమిళ విద్యావేత్తలు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీ నేతలు కూడా హర్షం ప్రకటిచి ఉండేవారని, అయితే డీఎంకే ప్రభుత్వం తమిళభాషను పతనస్థితికి తీసుకెళ్ళాలని భావిస్తున్నట్లు ఇటీవల చర్యలు రుజువు చేస్తున్నాయని అన్బుమణి పేర్కొన్నారు.

అర్హులైన గృహిణులందరికీ నెలకు రూ.1000

● రెవెన్యూ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్

ప్యారీస్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 'ఉంగళుడన్ స్టాలిన్' పథకంలో స్వీకరించే వినతులను పరిశీలించి అర్హతవున్న గృహిణులందరికీ నెలకు రూ.1000 అందజేయనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ పేర్కొన్నారు. విరుదునగర్ జిల్లా రాజపాళయం సమీపంలోని సేత్తూరు టౌన్ పంచాయతీలో జిల్లా కలెక్టర్ సుఖపుత్ర అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి రామచంద్రన్ పాల్గొన్నారు. రూ.5.96 కోట్లతో ఏసీతో నిర్మించనున్న కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సేత్తూరు ప్రాంతంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఎంపిక చేసిన విస్తీర్ణంలో నిర్మించనున్న కల్యాణ మండపంలో అన్ని వసతులుంటాయన్నారు. ఎంపీ రాణి, ఎమ్మెల్యే తంగపాండియన్, స్థానిక సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి రామచంద్రన్

ఏడో విడత చర్చలు విఫలం

● కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె ● సీపీఎం, అన్నాడీఎంకే నేతల పరామర్శ


సమ్మెలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులకు ఆహారం ప్యాకెట్లు అందిస్తున్న అన్నాడీఎంకే నేతలు

ప్యారీస్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయాలి, వేతనం పెంపు, ఎన్నికల హామీలు నెరవేర్చాలి, చెత్త తొలగింపు పనులను ప్రైవేటీకరణ చేయరాదనే డిమాండ్లతో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన నిర్వధిక సమ్మె ఆదివారం పదో రోజుకు చేరుకుంది. రిప్పన్ బిల్డింగ్ ముందున్న ఫుట్‌పాత్‌పై సుమారు 2వేల మంది కార్మికులు సమ్మె చేస్తున్నారు. వారిని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే)ఆర్గనైజర్ సీమాన్, అన్నాడీఎంకే మాజీ ఎంపీ బాలగంగ, మాజీ కౌన్సిలర్లు రాయపురం మనో, కన్నన్, వెట్రిలై మారిముత్తు తదితరులు ఆదివారం ఉదయం పరామర్శించారు. అన్నాడీఎంకే తరుపున కార్మికులందరికీ మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు అందజేశారు. మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్ బాబు కార్మిక సంఘాల ప్రతినిధులతో గతంలో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఆదివారం ఏడో విడతగా మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుపరన్ జరిపిన చర్చలు కూడా ఫలించలేదు. పారిశుధ్య కార్మికుల నిర్వధిక సమ్మె కారణంగా జీసీసీ నిర్వహణలోని రాయపురం, తిరువీకానగర్ జోన్లలో 900 టన్నులకు పైగా పేరుకుపోయిన చెత్తతో స్థానికులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఇదిలా వుండగా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం మీడియాతో మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలని డీఎంకే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే మాజీ ఎంపీ బాలగంగ మాట్లాడుతూ, కోరికల సాధన కోసం నిర్వధిక సమ్మెలో పాల్గొంటున్న పారిశుధ్య కార్మికుల గురించి మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ సహా డీఎంకే నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మరాదన్నారు. ఆ తర్వాత నామ్ తమిళర్ కట్చి ఆర్గనైజర్ సీమాన్ మాట్లాడుతూ, సీఎం స్టాలిన్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 12వేల మంది పారిశుధ్య కార్మికులను విధులనుండి తొలగించడంపై అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని తప్పుబట్టారని గుర్తు చేశారు.

శ్రీలంక నావికాదళం దాడులను ఖండిస్తూ
తంగచ్చిమఠం వద్ద జాలర్ల రాస్తారోకో


శ్రీలంక నావికాదళానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మహిళలు

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం చేసే దాడులను, అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఆదివారం ఉదయం రామేశ్వరం సమీపం తంగచ్చిమఠం ప్రాంతానికి చెందిన వందలాదిమంది జాలర్లు రాస్తారోకో నిర్వహించారు. రెండు రోజుల క్రితం సముద్రంలో చేపలవేటకు వెళ్ళి ఏడుగురు జాలర్లపై దాడి చేసిన శ్రీలంక నావికాదళం వారిని అక్రమంగా అరెస్టు చేసి తరలించారని, వారి పడవలను, వాటిలో ఉన్న విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారని జాలర్ల సంఘం నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువ జాము కూడా శ్రీలంక నావికాదళం దాడి చేసేందుకు గస్తీ నౌకలో వస్తుండటాన్ని గమనించిన కొందరు జాలర్లు సముద్రంలో విసిరిన వలలను తెంపుకుని తీరానికి చేరుకున్నారన్నారు. శ్రీలంక నావికాదళం దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలను చేపట్టనందుకు నిరసన వ్యక్తం చేస్తూ తంగచ్చిమఠం పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న రహదారిపై జాలర్లు, వారి కుటుంబీకులు రాస్తారోకో జరిపారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జాలర్ల ఆందోళన కారణంగా రామేశ్వరం- మదురై జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలు సుమారు రెండు గంటలకు పైగా స్తంభించాయి. పోలీసులు జాలర్లను తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు సోమవారం ఉదయంజాలర్ల సంఘం ప్రతినిధులను తీసుకెళ్ళి జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపిస్తామని పోలీసు ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో ఆదివారం సాయంత్రానికి జాలర్లు తమ ఆందోళనను విరమించుకున్నారు.


రాస్తారోకో చేస్తున్న జాలర్లు, ఆగిన బస్సులు

నేటినుంచి నిరవధిక సమ్మె...

ఇదిలా ఉండగా శ్రీలంక నావికాదళం తమిళ జాలర్లపై దాడులు జరుపటం, అక్రమ నిర్బంధాలను ఖండిస్తూ సోమవారం నుంచి నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్లు రామేశ్వరం జిల్లా జాలర్ల సంఘం నాయకులు ప్రకటించారు. ఆ మేరకు 13న తంగచ్చిమఠం బస్‌స్టేషన్ ముట్టడి ఆందోళన, 15న నిరాహార దీక్ష, 19న రైలురోకో నిర్వహించనున్నాట్లు పేర్కొన్నారు. జిల్లా అంతటా సోమవారం ఉదయం నుంచి జాలర్లు చేపలవేటకు వెళ్లకుండా ఆందోళనలో పాల్గొంటారని నాయకులు తెలిపారు.

సమాచార దృశ్ని

వాణిజ్య పన్ను శాఖ ఆదాయం రూ.44,481 కోట్లు

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్ను శాఖ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.44,841 కోట్లు ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.44,038 కోట్లు ఆదాయం రాగాగా, ప్రస్తుత ఏడాది రూ.803 కోట్లు అదనపు ఆదాయం సమకూరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో జీఎస్టీలో రాష్ట్ర వాటాగా రూ.25,035 కోట్లు సమకూరాయి. ఇది గత ఏడాది రూ.24,863 కోట్లుగా ఉందని అధికారులు తెలిపారు.

17న అయ్యప్ప స్వామి ఆలయంలో హోమం

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాలింగపురం అయ్యప్ప-గురువాయురప్ప ఆలయంలో ఈ నెల 17వ తేది హోమం నిర్వహించనున్నారు. ఈ ఆలయంలో ప్రతి నెలా మూడో ఆదివారం మృత్యుంజయ, సుదర్శన హోమాలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, సెప్టెంబరు నుంచి అన్ని హోమాలు మొదటి ఆదివారం చేయనున్నారు. వివరాలకు 044-28171197-3197, 9444290707, 8807918811 తదితర నెంబర్లు, www.ayyappan templesabs.org అనే వెబ్‌సైట్, mahalingapuram temple అనే మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని ఆలయ నిర్వహణ అధికారి అనీష్‌కుమార్ తెలిపారు.

ఆధ్యాత్మిక యాత్రికులకు ఆర్థిక సాయం

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బౌద్ధ, సమన, సిక్కు మతస్తులు దేశంలోని వారి మతానికి చెందిన పుణ్య స్థలాలకు వెళ్లేందుకు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి చెందిన బౌద్ధులు, సిక్కు, సమన మతాలకు చెందిన వారు పుణ్య యాత్రలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేస్తోంది. ఆ ప్రకారం, 50 మంది బౌద్ధ మతస్తులు, 50 మంది సయనులు, 20 మంది సిక్కు మతస్తులు మొత్తం 120 మందికి రూ.12 లక్షలు అందజేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు http://www.bcm bcmw.tn. gov .in అనే వెబ్‌సైట్, చెన్నై జిల్లా కలెక్టర్ ప్రాంగణంలోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో నవంబరు 30వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

జలాశయాల్లో 55.23 శాతం నీటినిల్వలు

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైకి తాగునీరందించే జలాశయాల్లో 55.223 శాతం నీటి నిల్వలున్నాయి. నగరానికి పుళల్, పూండి, చోళవరం, చెంబరంబాక్కం, కన్నన్ కోట తేర్వాయ్ కండిగై తదితర ఐదు జలాశయాల నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. ఈ ఐదు జలాశయాల సామర్థ్యం 11.757 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 6.494 టీఎంసీలు నిల్వలున్నాయని అధికారులు తెలిపారు.

రైల్వేలో అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు టిక్కెట్లు ఇచ్చే అసిస్టెంట్ పోస్టులకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై రైల్వే డివిజన్ పరిధిలో ప్రయాణికులకు టిక్కెట్లు అందించేలా అసిస్టెంట్ (ఎం-యూటీఎస్ సహాయాగ్స్) నియామకాలు చేపట్టామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 11 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. టిక్కెట్ల విక్రయాలను బట్టి అసిస్టెంట్లకు ప్రోత్సాహక భత్యం ఉంటుందని, మరిన్ని వివరాలకు ఇండియన్ రైల్వే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని దక్షిణ రైల్వే తెలిపింది.

రేపు కృష్ణగిరిలో ఈపీఎస్ ప్రచారం

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మంగళవారం ప్రచారం చేపట్టనున్నారు. హోసూరు నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరి, సూలగిరి జాతీయ రహదారి మీదుగా కృష్ణగిరి బస్టాండ్, టీబీ రోడ్డు, గాంధీ విగ్రహం మీదుగా కృష్ణగిరి ప్రభుత్వ వైద్యకళాశాల వరకు రోడ్ షో నిర్వహించనున్నారు. అనంతరం 5 గంటలకు సభలో ప్రసంగించనున్నారు. రాత్రి 7.30 గంటలకు బర్గూర్ ఎంజీఆర్ విగ్రహం సమీపం, 8.30 గంటకలు ఊత్తంగరై ఎంజీఆర్ విగ్రహం సమీపంలో జరుగనున్న బహిరంగ సభల్లో ఈపీఎస్ ప్రసంగిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

'నలం కాక్కుం స్టాలిన్' ద్వారా 92,836 మందికి లబ్ధి

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'నలం కాక్కుం స్టాలిన్' పథకంలో 92,836 మంది లబ్ధిపొందారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ పథకంలో అన్ని జిల్లాల్లో నిర్వహించనున్న ప్రత్యేక వైద్య శిబిరాలను ఈ నెల 2న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు.

14న ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకు సచివాలయం ముట్టడిస్తామని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రకటించిన నేపథ్యంలో ప్రాథమిక విద్యావిభాగం ఉన్నతాధికారులు ఈ నెల 14న చర్చలు జరుపనున్నారు. పాత పింఛన్ విధానం అమలు సహా 10 డిమాండ్ల సాధనకు రాష్ట్ర ప్రాథమిక విద్య ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గత నెల 17,18 తేదీల్లో ఆందోళన చేపట్టారు. తమ ఆందోళనల్లో భాగంగా ఈ నెల 22న సచివాలయం ముట్టడి చేపట్టనున్నట్లు సమాఖ్య ప్రకటించింది. ఈ క్రమంలో సమాఖ్య ప్రతినిధులతో పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఈ నెల 14న చర్చించనున్నట్లు అధికారులు తెలిపారు.

8వ తరగతి హాల్‌టిక్కెట్ల విడుదల

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో తరగతి పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే ప్రైవేటు అభ్యర్థుల హాల్ టిక్కెట్లు సోమవారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్ష శాఖ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో 8వ తరగతి ప్రైవేటు అభ్యర్థుల పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 22వ తేది వరకు జరుగనున్నాయి. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

వాల్పారై - పొల్లాచ్చి రహదారిలో

బస్సును అడ్డుకున్న ఏనుగులు



చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారై - పొల్లాచ్చి రహదారిలో పొల్లాచ్చి నుండి వెళుతున్న బస్సును అడవి ఏనుగులు అడ్డుకోవటంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. వాల్పారై అటవీ ప్రాంతానికి చేరువుగా ఉండటంతో అడవి ఏనుగులు రహదారుల్లో సంచరించడం ఆనవాయితీగా మారింది. ముఖ్యంగా కరుమలై, సిరుగుండ్రా, వెళ్లమలై, పుదుతోట్టమ్, తాయ్ ముడి, నడుమలై అమ్మయప్పన్ కోవిల్ ప్రాంతాల్లో అడవిఏనుగులు గున్న ఏనుగులతో కలిసి తిరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి వాల్పారై - పొల్లాచ్చి రహదారిలో మూడో నెంబర్ మలుపువద్ద రాష్ట్ర రవాణా సంస్థ బస్సును మూడు ఏనుగులు అడ్డుకున్నాయి. వాటిని చూడగానే బస్సులోని ప్రయాణికులు భీతిల్లారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును వెనక్కి నడుపుకుంటూ వెళ్లారు. ఆ బస్సు వెనుకనే ఉన్న వాహనాలను ఎక్కడికక్కడే ఆపివేశారు. అరగంట తర్వాత ఆ ఏనుగులు అడవిలోకి వెళ్లాయి. ఆ తర్వాతే ఆ మార్గంలో వాహనాల రాకపోకలు సాఫీగా జరిగాయి.

పుదువై బార్‌లో చెన్నై కళాశాల విద్యార్థి హత్య

● మరొకరి పరిస్థితి విషమం

పుదుచ్చేరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలోని మద్యం బార్‌లో పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న చెన్నైలోని ఓ కళాశాల విద్యార్థి హత్యకు గురికాగా, మరో విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పర్యాటకులను ఆకట్టుకునేలా పుదుచ్చేరి ప్రభుత్వం రెస్టోబార్లకు అనుమతించింది. శని,ఆదివారాలు సెలవు రోజులు కావడంతో స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఓ కళాశాలలో చదువుకుంటున్న మోషిక్ షణ్ముగ ప్రియన్ (21), షాషన్ (21) సహా 15 మంది విద్యార్థులు పుదుచ్చేరి మిషీన్‌రోడ్డులో ఉన్న రెస్టోబారుకు వెళ్ళి శనివారం రాత్రి మద్యం సేవించారు. బారు మూసివేసే వరకు వారు మత్తులో సందడి చేశారు. బార్ మూసివేసే సమయం కావడంతో వారిని బయటికి వెళ్లాలంటూ ఆదేశించిన బార్ సిబ్బంది, బౌన్సర్లతో వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం చివరకు ఘర్షణకు దారితీసింది. ఇందులో కత్తిపోట్లకు గురైన మోషిక్ షణ్ముగ ప్రియన్, షాషన్‌లను కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారిని పరిశీలించిన వైద్యులు మోషిక్ షణ్ముగ ప్రియన్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. షాషన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి డీఐజీ సత్య సుందరం నేతృత్వంలో ఆదివారం ఉదయం సంబంధిత రెస్టోబారుకు వెళ్ళిన పోలీసులు బృందం విచారణ జరిపి సీసీ పుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన బార్ యజమాని రాజ్‌కుమార్‌తో పాటు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మృతుడు శివగంగ జిల్లాకు చెందిన వ్యక్తిగా తెలిసింది.



హత్య జరిగిన బారు వద్ద పోలీసులు

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కోడంబాక్కం: ట్రస్ట్ పురం, ఆర్కాట్ రోడ్డు (పవర్ హౌస్ నుంచి రైల్వే ట్రాక్ వరకు), ఇన్బరాజపురం, వన్నియర్ వీధి, భజన ఆలయ వీధి, వరదరాజపేట మెయిన్ రోడ్డు, కామరాజర్ నగర్, రంగరాజపురం ఏరియా, వరగుఈషాపురం, కామరాజర్ కాలనీ 1 నుంచి 8 వీధులు, అజీస్ నగర్, ఆత్రేయ పురం 1,2 వీధులు, ఆండవర్ నగర్, అన్నా నెడుంపాదై, సర్క్యులర్ రోడ్డు, సౌరాష్ట్ర నగర్, శంకరాపురం, చూలైమేడు హైరోడ్డు, గిల్ నగర్, వీఓసీ మెయిన్ రోడ్డు, వీఓసీ 1 నుంచి 5 వీధులు, దురైస్వామి రోడ్డు, సుబ్బురాయన్ వీధి 1 నుంచి 8 వీధులు, ఆళగిరి నగర్ మెయిన్ రోడ్డు, గంగై అమ్మన్ ఆలయ వీధి, పెరియార్ పాదై, పద్మనాభన్ నగర్, తమిళర్ వీధి, వళ్లలార్ వీధి, ఇళంగోఅడిగళ్ వీధి, ఈథిల్‌రాజ్ వీధి, అయ్యప్ప నగర్, 100 అడుగుల రోడ్డు

పెరుంగుడి: ఇండస్ట్రియల్ ఎస్టేట్, బర్మా కాలని, వెంకటేశ్వర నగర్, సీవరం, కెనాల్ పురం, బాలమురుగన్ గార్డెన్, సెక్రటరీయేట్ కాలని, నీలాంగరై లింక్ రోడ్డు, కస్టమ్స్ కాలని, రాజీవ్ గాంధీ రోడ్డు, పంచాయత్ రోడ్డు, ఎళిమ్ నగర్, కందంచావిడి, సంతోష్ నగర్, పాల్‌రాజ్ నగర్, వీరమామునివర్ రోడ్డు, ఇళంగో నగర్, కామరాజ్ వీధి, గాంధీ వీధి, పెరియార్ రోడ్డు, గావిందన్ నగర్, పాలవాక్కం కెనాల్ రోడ్డు, కజురా గార్డన్, రంగారెడ్డి గార్డన్, చిన్న నీలాంగరైకుప్పం, కపాలీశ్వర్ నగర్, సౌత్ అండ్ నార్త్ పాండియన్ రోడ్డు, వైద్యలింగం రోడ్డు, సీఎల్ఆర్ఐ నగర్, రూగి కాంప్లెక్స్

అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్: సౌత్ ఫేస్, ముగప్పేర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ 1,2 మెయిన్ రోడ్డు, సదరన్ అవెన్యూ, రెడ్డి వీధి, కావరై వీధి, మునుస్వామి వీధి, ఎస్ఎస్ఓఏ కాంప్లెక్స్, కల్యాణి ఎస్టేట్, నటేశన్ నగర్.

ఈపీఎస్ కలలు ఫలించవు...!

● మళ్లీ ముఖ్యమంత్రిగా ఎంకే స్టాలిన్
● మంత్రి కేఎన్ నెహ్రూ

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈపీఎస్ కలలు ఫలించబోవని, మళ్లీ ముఖ్యమంత్రిగా స్టాలిన్ ప్రమాణం చేస్తారని మంత్రి కేఎన్ నెహ్రూ జోస్యం చెప్పారు. తిరుచ్చిలో తొలిసారిగా 11 లో ఫ్లోర్ బస్సులను పురపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంకే కూటమి పార్టీల్లో ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని, అన్నాడీఎంకే కూటమి పార్టీల్లో విభేధాలు కనిపిస్తున్నాయన్నారు. అందువల్లే ఓపీఎస్, ఈపీఎస్‌ను వదిలి వెళ్లారన్నారు. డీఎంకే ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని, మళ్లీ ముఖ్యమంత్రిగా స్టాలిన్ పదవీ ప్రమాణం చేస్తారని అన్నారు. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనపై మంత్రి స్పందిస్తూ... ఇప్పటికే ఎనిమిది సార్లు పర్యటించారని, ఆయన వచ్చినా గత పార్లమెంటు ఎన్నికల్లో 40కి 40 స్థానాలు డీఎంకే కూటమి కైవసం చేసుకుందన్న నిజాన్ని వారు గ్రహించాలని మంత్రి హితవు పలికారు.

పుళియంజోలైలో ఎలుగుబంటి సంచారం



చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి, నామక్కల్ జిల్లాల సరిహద్దులో ఉన్న కొల్లిమలై కొండదిగువన పుళియంజోలై పర్యావరణ పర్యాటక ప్రదేశంలో గత రెండు రోజులుగా ఎలుగుబంటి సంచరిస్తుండటంతో ఆ ప్రాంతాన్ని అధికారులు మూసివేశారు. దీంతో అక్కడకు వెళ్ళిన పర్యాటకులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. ఈ పర్యావరణ పర్యాటక ప్రాంతం పైభాగం నామక్కల్ జిల్లా సరిహద్దులోను, దిగువ భాగం తిరుచ్చి జిల్లా సరిహద్దులో ఉన్నాయి. శనివారం సాయంత్రం ఆరుగంటల సమయంలో పుళియంజోలై పర్యాటక ప్రదేశం వద్ద ఎలుగుబంటి సంచరించడంతో ఆ ప్రదేశాన్ని మూసివేసి పర్యాటకులు రాకుండా కట్టుదిట్టం చేసినట్లు నామక్కల్ జిల్లా అటవీ శాఖ ఉన్నతాధికారి మాధవి తెలిపారు.

ఓట్ల చోరీ వ్యవహారంలో విశ్వాసం కోల్పోయిన ఈసీ

● టీఎన్‌సీసీ ఎస్సీ విభాగం నేత రంజన్‌కుమార్



ప్యారీస్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఓట్ల చోరీ వ్యవహారంలో ఎన్నికల కమిషన్ ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఎస్సీ విభాగం అధ్యక్షుడు రంజన్‌కుమార్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో ఓట్లు కొల్లగొట్టేందుకు బీజేపీతో ఎన్నికల సంఘం కుమ్మక్కు అయినట్లు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఓట్ల చోరీ వ్యవహారాన్ని ఖండిస్తూ కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానం పరిధిలోని మహదేవపురం నియోజకవర్గంలో లక్షా 250 ఓట్లు చోరీ కావడాన్ని ఖండిస్తూ సోమవారం టీఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఆందోళనలో ఎస్సీ విభాగం నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొంటారని ఆదివారం ఆయన తెలిపారు.

మాకు రావాల్సిన నగదు ఇప్పించండి సారూ!

● ఎస్పీ కార్యాలయంలో తల్లీకుమార్తెల ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయం ఎదుట బాధితురాలు సంగీత

వేలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల వ్యవహారంలో తమకు రావాల్సిన నగదును తమకు ఇప్పించాలని కోరుతూ వేలూరు జిల్లా పక్కంపాళయం సమీపంలోని పుదుపట్టుకు చెందిన సంగీత అనే మహిళ ఆదివారం ఉదయం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆమె కుమార్తెతో కలిసి ఫిర్యాదు చేసింది. దీనిపై సంగీత మీడియాతో మాట్లాడుతూ, తన భర్త దురైస్వామి నాయుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, ఇదే అదునుగా చూసుకున్న తన భర్త సోదరుడు తమ ఇంటి దస్తావేజులను వారిపేరి మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బాధితురాలు పేర్కొంది. అనంతరం ఇళ్ల పత్రాలు వారిపేరు మీద ఉన్నట్లు గుర్తించి న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా గ్రామపెద్దలు ఆపి పంచాయతీలో చర్చించి నష్టపరిహారంగా తమకు రూ.5లక్షలు ఇప్పిస్తామని తెలిపి, ముందుగా రూ.2లక్షలు అందజేశారని ఆమె తెలిపింది. ఎంతకాలమైన మిగిలిన నగదు తమకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, దీనిపై గ్రామపెద్దలకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని వాపోయింది. అందుకే తమ సమస్యను ఎస్పీకి విన్నవించి, తమకు న్యాయం చేయాలని కోరినట్లు ఆమె తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే

'ఉంగళుడన్ స్టాలిన్'

ఎమ్మెల్యే చంద్రన్



ప్రజలకు సహాయాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తిరుత్తణి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వంలో ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ పేర్కొన్నారు. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు యూనియన్ పరిధిలోని కోన సముద్రం గ్రామంలో ఆదివారం ఉదయం 'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కోసం సీఎం స్టాలిన్ నేతృత్వంలోని నేతలు, అధికారులు ప్రజలకు అందుబాటులో వుంటూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతున్నారన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం, వృద్ధులకు ఆరోగ్య కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పళ్లిపట్టు యూనియన్ కార్యదర్శి జి.రవీంద్రన్, పార్టీ నిర్వాహకులు గోపి, గవాస్కర్, గోవిందస్వామి, మోహన్, అచ్యుతమూర్తి, వేలుమలై సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

17న 'శ్రీకనకదుర్గాశతకం' పుస్తకావిష్కరణ

అడయార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్, రాయపేట హైరోడ్డు, లజ్‌లో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో ఈ నెల 17, ఆదివారం ఉదయం ప్రముఖ రచయిత డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్ రచించిన 'శ్రీకనకదుర్గాశతకం' పుస్తకావిష్కరణ జరుగనుంది. కిడాంబి లక్ష్మీకాంత్ ప్రార్థనాగీతంతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తారు. సభాధ్యక్షులుగా జనని అధ్యక్షురాలు డాక్టర్ నిర్మలా పళనివేలు, ముఖ్య అతిథిగా వేద విజ్ఞాన వేదిక (చెన్నై) అధ్యక్షుడు జలదంకి కోదండరామరెడ్డి, ఆత్మీయ అతిథులుగా మద్రాస్ యూనివర్శిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు, తమిళనాడు ప్రభుత్వేతర వైద్యశాలల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ దీవి రాంబాబు పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి తెలుగు సాహితీ ప్రియులంతా ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

డీఎంకే కూటమిలోనే కొనసాగుతాం...!

● ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో



పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలోనే ఎండీఎంకే కొనసాగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో స్పష్టం చేశారు. తూత్తుకుడి వీవీటీ సిగ్నల్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో వైగో మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కాంక్షిస్తూ డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ పాలన చేస్తున్నారన్నారు. ఇలాంటి మంచి పాలన కొనసాగాలని, 2026 ఎన్నికల్లోనూ మళ్లీ డీఎంకే నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. డీఎంకే కూటమిలోనే తాము ఉన్నామని, అందులో సందేహాలకు తావు లేదని స్పష్టం చేశారు.

టిప్పర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

తిరుత్తణి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలో డీసీ కండిగై వద్ద టిప్పర్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. తిరుత్తణి సమీపంలోని సిద్ధార్ డీసీ కండ్రిగ స్టోన్ క్రషర్ నుంచి చెన్నై, కాంచీపురం, వేలూరు తదితర ప్రాంతాలకు కంకరను టిప్పర్ లారీల ద్వారా తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం అధికలోడుతో ఓ టిప్పర్ లారీలో కంకర రాళ్ల లోడు తరలిస్తుండగా, మార్గమధ్యంలో టిప్పర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. స్థానికులు వెంటనే లారీ డ్రైవర్‌ను రక్షించి దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు పనులు చేపట్టారు.

● ఆడి చివరి ఆదివారం ఎఫెక్ట్

కాశిమేడు రేవుకు పోటెత్తిన ప్రజలు

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తమిళ మాసం ఆడి చివరి ఆదివారం సందర్భంగా నగరవాసులు చేపలు కొనేందుకు కాశిమేడు రేవుకు వేల సంఖ్యలో తరలివెళ్ళారు. ఆడి చివరి ఆదివారం అమ్మవారికి అంబళ్లు పోయటంతోపాటు మేక మాంసం, కోడి మాంసం, చేపలు వండి నైవేద్యంగా పెట్టడం ఆనవాయితీ. ఆ మేరకు ఆదివారం వేకువజామునే నగర వాసులు కాశిమేడు చేపలరేవుకు వెళ్ళి చేపలను పోటీపడి కొనుగోలు చేశారు.

తేనెటీగల దాడిలో కళాకారుడి మృతి



మృతుడు గోపు (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో డోలు వాద్య కళాకారుడు మృతి చెందిన ఘటన విల్లుపురం జిల్లాలో చోటు చేసుకుంది. వానియంపాళయం గ్రామంలోని శ్రావణ పౌర్ణమి సందర్భంగా యజ్ఞోపవీత ధారణ శనివారం జరిగింది. ఈ వేడుకల్లో వాయిద్య కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అగరబత్తీలు వెలిగించిన సమయంలో పొగకు సమీపంలోని చెట్టుపై ఉన్న తేనె తెట్టు నుంచి తేనేటీగలు ఆ ప్రాంతంలో ఉన్న వారిపై దాడిచేశాయి. డోలు కళాకారులు గోపు సహా పది మందికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గాయపడిన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో గోపు మృతిచెందాడు. అగ్నిమాపక సిబ్బంది తేనె తెట్టును తొలగించారు.

'ఛార్జింగ్' కేంద్రాల ఏర్పాటుకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్ నగర్, మైలాపూర్ సహా తొమ్మిది ప్రాంతాల్లో, విద్యుత్ వాహనాలకు 'ఛార్జింగ్' కేంద్రాల ఏర్పాటుకు ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్ బోర్డు టెండర్లు ఆహ్వానిస్తోంది. పర్యావరణ పరిరక్షణ, పెట్రోల్, డీజిల్ వ్యయం తగ్గించేలా ప్రస్తుతం విద్యుత్ వాహనాల కొనుగోళ్లు అధికమయ్యాయి. విద్యుత్ వాహన యజమానుల సౌకర్యార్థం నగరంలో 9 ప్రాంతాల్లో ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని విద్యుత్ బోర్డు నిర్ణయించింది. ఆ ప్రకారం, బీసెంట్ నగర్ అష్టలక్ష్మి ఆలయ పార్కింగ్, బీసెంట్ నగర్ బీచ్ పార్కింగ్, మెరీనా బీచ్, మైలాపూర్ నాగేశ్వరరావు పార్క్, తేనాంపేట సెమ్మొళి పార్క్, ముగప్పేర్ మంగల్‌ఏరి పార్కింగ్, 133వ వార్డు కార్పొరేషన్ క్రీడా పార్క్, సోమసుందరం పార్క్, 102వ వార్డు పార్క్ తదితర ప్రాంతాల్లో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్ బోర్డు టెండర్లు ఆహ్వానించింది.

చోరీలకు పాల్పడిన దొంగలను అరెస్టు చేయండి

● పోలీసులకు గ్రామస్తుల విజ్ఞప్తి



ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న గ్రామస్తులు

తిరుత్తణి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఒకే రోజు పలుఇళ్లలో చోరీలకు పాల్పడిన దొంగలను అరెస్టు చేయాలని కోరుతూ తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని కోనేడంపేట గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. కోనేడంపేట గ్రామస్తులైన ఎం.పార్థసారథి, రామమూర్తి, కేఆర్ నరసింహులు, వి.మునిశాంత్ తిరుమూర్తి ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వారిళ్లలోకి దూరి రూ.లక్ష నగదు, ఎల్ఈడీ టీవీ, వెండి సామగ్రిలను దొంగిలించారని పంచాయతీ అధికారులకు తెలుపగా ఆదివారం ఉదయం పళ్లిపట్టు పోలీస్‌స్టేషన్‌లో గ్రామ పెద్దలందరూ కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, గత రెండేళ్ల గ్రామంలోని పలువురు కూలీ పనుల నిమిత్తం చెన్నై నగరం, పొరుగు రాష్ట్రమైన బెంగళూరు వెళ్ళారని, దీనిని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులెవరో ఈ చోరీలకు పాల్పడి వుంటారన్నారు. పోలీసులు తక్షణమే చర్యలు చేపట్టి నిందితులను పట్టుకోవల్సిందిగా వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి

ప్యారీస్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలో ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో న్యాయవాది మృతిచెందారని పోలీసులు తెలిపారు. రాణిపేట జిల్లా జ్యోతిమోటూరు ప్రాంతానికి చెందిన లాయర్ కుమార్ (52, ఆయన భార్య సుధ (45) ద్విచక్రవాహనంలో తిరుత్తణిలోని ఓ ఆస్పత్రికి బయలుదేరారు. తిరుత్తణి సమీపంలోని కుమరకుప్పం ప్రాంతం చేరుకున్న సమయంలో హఠాత్తుగా రోడ్డు పక్కన ఆగివున్న ట్రాక్టర్‌ను వెనుక నుండి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుమార్ భార్య కళ్లముందే మృతిచెందారు. గాయపడిన సుధను స్థానికులు అంబులెన్స్‌లో తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చర్యలు చేపట్టారు.

ఈపీఎస్‌తో పొత్తు ఆలోచన లేదు...!

● టీటీవీ దినకరన్

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మళ్లీ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామితో పొత్తుపెట్టుకునే ఆలోచన లేదని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ స్పష్టం చేశారు. విల్లివాక్కం నియోజకవర్గం ఏఎంఎంకే నేతల సమావేశం అయనావరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న దినకరన్ మీడియాతో మాట్లాడుతూ... జాతీయ విద్యా విధానం ప్రారంభమై ఐదేళ్లు గడించిందన్నారు. త్వరలో అధికారం కోల్పోతామని భావించిన డీఎంకే, తాజాగా ద్విభాషా విధానం ప్రకటించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వంను మళ్లీ కూటమిలోకి తీసుకొచ్చేలా ఢిల్లీ అధిష్ఠానం చర్చలు జరపాలని తాను కోరుతున్నట్టు తెలిపారు. ఏడాది కాలంగా ఎన్డీఏ కూటమిలో ఉన్నామని, ఏఎంఎంకే పార్టీ ప్రారంభించి ఏడేళ్లు పూర్తయిందని, మళ్లీ పళనిస్వామితో జత కట్టే ఆలోచన తమకు లేదని దినకరన్ తేల్చిచెప్పారు.

కమల్‌కు హత్యా బెదిరింపు

● నటుడిపై చర్యకు ఫిర్యాదు

అడయార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు, ఎంఎన్ఎం అధ్యక్షుడు, సినీ నటుడు కమల్ హాసన్‌కు హత్యా బెదిరింపులకు పాల్పడిన జూనియర్ ఆర్టిస్ట్ రవిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో తాజాగా ఫిర్యాదు చేశారు. ఇటీవల నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో కమల్ హాసన్ పాల్గొని సనాతన ధర్మంపై తన మనసులోని మాట వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. కమల్‌పై పలు ఆస్తిక సంఘాల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో హత్యా బెదిరింపులకు పాల్పడిన జూనియర్ ఆర్టిస్ట్ రవిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఎన్ఎం నేతలు ఫిర్యాదు చేశారు.

కుమార్తెను హత్యచేసి తండ్రి ఆత్మహత్య

అడయార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని సమీపంలోని కణకన్ పట్టిలో కుమార్తెను హత్య చేసిన తండ్రి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. మృతులను పళనియప్పన్ (55), లక్ష్మి (23)గా గుర్తించారు. లక్ష్మికి ఇంకా వివాహం కాలేదు. పైగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎంతో మంది వైద్యులకు వద్ద చూపించినా పురోగతి లేకపోవడంతో విరక్తి చెందిన తండ్రి ఈ దారుణానికి పాల్పడివుంటారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

విమాన ప్రయాణికులకు రాయితీ

అడయార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విమాన ప్రయాణికులకు ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు ప్రయాణ చార్జీల్లో రాయితీ ప్రకటించాయి. ఆ ప్రకారంగా డొమెస్టిక్ ప్రయాణికులకు ప్రయాణ చార్జీ రూ.1279 నుంచి, అంతర్జాతీయ ప్రయాణికులకు రూ.4279 నుంచి ప్రయాణ చార్జీ ప్రారంభంకానుంది. ఈ రాయితీ కేవలం ఈ నెల 11, సోమవారం నుంచి 15వ తేదీ శుక్రవారం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

వైమానిక దళంలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 'అగ్ని వీర్' ఎంపిక శిబిరం సెప్టెంబరు 2 నుంచి 5వ తేది వరకు తాంబరం వైమానిక కేంద్రంలో జరుగనుందని చెన్నై జిల్లా కలెక్టరేట్ ఒక ప్రకటన విడుదల చేసింది. ప్లస్‌టూలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చు. వివరాలకు www.agnipathvayu.edac.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

బాంద్రా టెర్మినల్ - వేలాంకన్ని మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): బాంద్రా టెర్మినల్ నుంచి వేలాంకన్ని మధ్య ఈనెల 27, సెప్టెంబరు 6 తేదీల్లో ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. బాంద్రలో ఈ ప్రత్యేక రైలు(09093) ఈనెల 27న రాత్రి 9.40 గంటలకు బయలుదేరి బొరివాలి, వాసైరోడ్డు, పాన్‌వేల్, లోనావాలా, పూణే, డోండ్, షోలాపూర్, కాలాబురాగి, వాడి, యాదగిరి, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, వేలూరు, తిరువణ్ణామలై, విల్లుపురం, మైలాడుతురై, నాగపట్టణం మీదుగా వేలాంకన్నికి రెండవ రోజు ఉదయం 7.40 గంటలకు చేరుకుంటుంది. వేలాంకన్నిలో ఈ ప్రత్యేక రైలు(09094) ఈనెల 30వ తేదీ శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ రెండవ రోజు ఉదయం 10.30 గంటలకు బాంద్రా చేరుకుంటుందని వివరించారు.

నేటినుంచి టూ వేగా ఆళ్వార్‌పేట వంతెన

అడయార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వర్షపు, డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనుల్లో భాగంగా ఆళ్వార్‌పేట వంతెనపై సోమవారం నుంచి వాహనాల రాకపోకలను టూ వేగా మార్చుతున్నారు. దీనిపై చెన్నై నగర ట్రాఫిక్ పోలీసులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వాహనాలకు ఈ వంతెనపై అనుమతి లేదని, సర్వీస్ రోడ్డులో గమ్యస్థానానికి చేరుకోవాల్సి ఉంటుందని అందులో పేర్కొంది.

అడ్వాన్స్ బుకింగ్స్‌లో 'కూలీ' రికార్డు

చిత్రజ్యోతి


సూపర్‌స్టార్ రజనీకాంత్ - డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'కూలీ' చిత్రం ఈ నెల 14న విడుదలకానుంది. దీంతో అడ్వాన్స్ బుకింగ్స్ శనివారం నుంచి ప్రారంభం కాగా, సరికొత్త రికార్డు నెలకొల్పింది. బుకింగ్ ప్రారంభమైన కేవలం గంటలోనే చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి, సేలం, తిరునెల్వేలి వంటి ప్రధాన నగరాల్లో అన్ని థియేటర్లలో టిక్కెట్లు బుక్ అయ్యాయి. అదేసమయంలో కౌంటర్ టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు థియేటర్ల వద్ద రజనీకాంత్ అభిమానులతో పాటు ప్రేక్షకులు భారీగా గుమికూడారు. ఈ పరిస్థితి ఒక్క రాష్ట్రంలోలోనే కాకుండా, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా నెలకొంది. కేరళ రాష్ట్రంలో కేవలం గంటలోనే కోటి టిక్కెట్లు అమ్ముడుపోయాయి. బుక్‌మై షోలో ఒకే రోజులో 3.76 లక్షల టిక్కెట్లు బుక్ అయ్యాయి. జాతీయ స్థాయిలో మోహన్‌లాల్ 'ఎంపురాన్' తర్వాత ఆ స్థాయిలో టిక్కెట్లు బుకింగ్స్ అయిన చిత్రంగా 'కూలీ' నిలిచింది.



'కూలీ'లో రజనీకాంత్

సోషల్ మీడియాను షేక్ చేస్తున్న తాన్య

కోలీవుడ్ యువ హీరోయిన్ తాన్య రవిచంద్రన్ బోల్డ్ ఫొటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.. ఆది పినిశెట్టి - చైతన్య రావు జంటగా నటించిన 'మయసభ' పొలిటికల్ వెబ్ సిరీస్‌లో తాన్య రవిచంద్రన్ ఒక ప్రత్యేక పాత్ర పోషించడంతో పాటు ప్రత్యేక గీతంలో ఎక్స్‌పోజింగ్ చేస్తూ నృత్యం చేసింది. ఈ పాటలోని ఆమె వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఫొటోలను ఆమె షేర్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు, ఆమె అభిమానులు సైతం 'ఔరా.. తాన్య' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. తమిళం, తెలుగు భాషా చిత్రాలు, వెబ్ సిరీస్‌లలో నటిస్తూ బిజీగా ఉన్న తాన్య.. అరుణ్ విజయ్ హీరోగా నటించిన 'రెట్ట తల' చిత్రంలో హీరోయిన్‌గా నటించగా, ఇది విడుదలకు సిద్ధంగా ఉంది.



తాన్య రవిచంద్రన్

కథల ఎంపిక, క్యారెక్టర్ ముఖ్యం

● సిమ్రన్



సిమ్రన్, రామ్‌కుమార్‌తో టీఎంజేఏ నిర్వాహకులు

చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టే వర్ధమాన హీరోయిన్లు సుదీర్ఘకాలం కొనసాగాలంటే కథల ఎంపికతో పాటు క్యారెక్టర్ ఎంతో ముఖ్యమని సీనియర్ నటి సిమ్రన్ అభిప్రాయపడ్డారు. తమిళ మూవీ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎంజేఏ) సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం రాత్రి నగరంలో జరిగింది. ఇందులో సిమ్రన్, జాతీయ చలనచిత్ర అవార్డుకు ఎంపికైన సినీ దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్ అతిథులుగా పాల్గొని గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిమ్రన్ మాట్లాడుతూ, 'మూడు దశాబ్దాలుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్నాను. అప్పటి నుంచి ఇప్పటివరకు మూవీ జర్నలిస్టులు నన్ను అభిమానిస్తూ అండగా నిలిచారు. రీఎంట్రీ తర్వాత కూడా వారి మద్దతు మరువలేనిది. అందువల్లే నేను ఇంకా చిత్రపరిశ్రమలో కొనసాగుతోంది.. ఇపుడు ఇండస్ట్రీకి వచ్చే హీరోయిన్లు సుదీర్ఘకాలం పాటు చిత్రపరిశ్రమలో కొనసాగాలంటే కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే క్యారెక్టర్‌ను కూడా కాపాడుకోవాలి. 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమా చూసిన హీరోయిన్ త్రిష కామెంట్స్ చేస్తూ నన్ను స్ఫూర్తిగా తీసుకున్నట్టు చెప్పారు. అలాగే నాకు కూడా దివంగత నటి శ్రీదేవి స్ఫూర్తి.ఇకపోతే, సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'కూలీ' సినిమా కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను. ఇటీవలి కాలంలో నేను నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ', 'అంధగన్', 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రాలు సక్సెస్ సాధించాయి. నాకు కూడా జాతీయ అవార్డుపై ఆశ ఉంది' అని అన్నారు.దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్ మాట్లాడుతూ, 'మీడియా సపోర్టు వల్లే 'పార్కింగ్' మూవీ ఘన విజయం సాధించింది. ఆ సినిమాకు మూడు జాతీయ అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంజేఏ అధ్యక్షురాలు ఎస్.కవిత, ప్రధాన కార్యదర్శి కోడంకి అబ్రహాం, కోశాధికారి దురై శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాయం కోసం అభినయ్ ఎదురు చూపు

● ఆదుకున్న దక్షణ్ విజయ్

'తుల్లువదో ఇలమై' నటుడు అభినయ్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నటుడు, నిర్మాత దక్షణ్ విజయ్ తనవంతు సాయం చేశారు. 'తుల్లువదో ఇలమై', 'జంక్షన్', 'దాస్' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించిన అభినయ్ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. అలాగే, త్వరలో ఆయనకు కిడ్నీ మార్పిడి చికిత్స కూడా జరుగనుంది. హీరో, నిర్మాత దక్షణ్ విజయ్ ఈ విషయం తెలుసుకుని అభినయ్‌ని కలిసి ఆరోగ్యంతో పాటు యోగక్షేమాలను అడిగి తెలుసుకుని తనవంతు సాయం చేశారు. ఆ సమయంలో అభినయ్ బోరున విలపిస్తూ, తనకు తల్లిదండ్రులు, భార్యా పిల్లలు ఎవరూ లేరని తాను ఒక అనాథ అని, తనకు ఈ దుస్థితి వస్తుందని ఊహించలేదన్నారు.



అభినయ్‌కు సాయం చేస్తున్న దక్షణ్ విజయ్



మునక్కాయలు సేకరిస్తున్న కార్మికులు - (ఇన్‌సెట్‌లో) ద్విచక్రవాహనానికి మునక్కాయలు కడుతున్న రైతులు - కరూర్‌లో రైతులు సాగుచేస్తున్న మునగ పంట

ఆరోగ్య ప్రదాయని.. పోషకాల గని

● ఆయుర్వేద అమృతం మునగ ● పాలకంటే అధిక కాల్షియం
● ప్రకృతి ప్రసాదించిన ఔషధం

ఆయుర్వేదంలో అమృతంగా, పోషకాల గనిగా చెప్పబడే మునక్కాయలే కాదు ఆకు నుంచి కాండం వరకు, పూవులు ప్రతీది పోషకాల సమాహారమే. ఐరన్ లోపంతో బాధపడేవారికి, చక్కెర వ్యాధి గ్రస్తులకు ఇలా ఎన్నో రోగాలను నివారించే సంజీవని మునగ. మునగాకులో ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అంతటి ప్రాధాన్యత ఉన్న మునగపై ప్రత్యేక కథనం...

- చెన్నై, ఆంధ్రజ్యోతి



మునగపొడి

మునగకాయతో వండే వంటకాలు అంటే అందరికీ ఇష్టమే. మునక్కాయలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. మునక్కాయలో ఉండే సి విటమిన్ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మునక్కాయలో ఉండే కాల్షియం, ఫాస్పరస్ ఎముకలను దృఢం చేస్తాయి. మునక్కాయలో ఉండే ఫైబర్ జీర్ణ ప్రక్రియ మెరుగుపరుస్తుంది. శరీరానికి నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది. మునక్కాయలతో చేసిన వంటలు అందరూ ఇష్టంగా తింటారు. మునక్కాయలో బీ1, బీ2, బీ3, బీ5, బీ6, బీ9, విటమిన్ సీ, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, పొటాషియం, సోడియం, జింక్ వంటి పోషకాలు మెండుగా ఉన్నాయి. మునగలో పాల కంటే పదహారు రెట్లు కాల్షియం,, క్యారెట్ కంటే తొమ్మిది రెట్లు విటమిన్లను సమకూరుస్తుందని వైద్యులు చెబుతున్నారు. రోజువారీ ఆహార పదార్థాల్లో మునక్కాయ చేర్చుకుంటే కిడ్నీ సమస్యలు తగ్గుతాయి. తమిళంలో మురుంగై! ఇంగ్లీష్‌లో మోరింగా! తెలుగువారు మునక్కాయ, ములక్కాడ అని పిలిచే మునగ ఔషధంగా కూడా గుర్తింపు పొందింది. రాష్ట్రంలో రైతులు విస్తారంగా మునగ సేద్యం చేస్తుంటారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష ఎకరాల్లో మునగ పంట సాగవుతోంది. ఎక్కువగా కరూర్, అరవకురిచ్చి ప్రాంతాల్లో సాగు చేస్తుండగా, విదేశాలకు కూడా భారీ స్థాయిలో ఎగుమతి చేస్తున్నట్లు కరూర్‌కు చెందిన మునగ పంట సొసైటీ నిర్వాహకులు ఎస్.ముత్తురాజ్ తెలిపారు. రాష్ట్రం నుండి మునక్కాయలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతిచేస్తామని ఆయన తెలిపారు. మునగకాయలే కాకుండా మునగాకు, విత్తనాలను అమెరికా అధికంగా దిగుమతి చేసుకుంటోందని చెప్పారు. మునగ విత్తనాల్లో యాంటీఆక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి. అవి గాయాలను, రక్త కణాల వృద్ధి, కాలేయ, మూత్రపిండాలు, పేగులను శుభ్రపరిస్తాయి. అదేవిధంగా మునగాకు గ్యాస్ట్రిక్, అల్సర్, ఊబకాయం, మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాలను నయం చేస్తుంది. అంతేకాక మునగ విత్తనాల్లో శారీక దృఢత్వాన్ని, లైంగిక సామర్థ్యాన్ని పెంచే విశేషం గుణం ఉంది. 2015-2025వ సంవత్సరం వరకు రాష్ట్రం నుంచి దేశ, విదేశాలకు మునక్కాయలు ఎగుమతి చేయడం ద్వారా రూ.146 కోట్ల మేరకు ఆదాయం సమకూరిందని ఎస్.ముత్తురాజ్ అన్నారు. ఇదిలా ఉండగా ప్రపంచ వ్యాప్తంగా మునగకాయ, మునగాకు, వాటి విత్తనాలు సుమారు 27వేల కోట్ల మేరకు వాణిజ్యం జరిగిందని, అతిత్వరలో రూ.47వేల కోట్లకు మునక్కాయల వ్యాపారం పెరగొచ్చని మునగ రైతులు చెబుతున్నారు.



కరూరులో పండిన మునక్కాయలతో రైతు ముత్తురాజ్

ఐశ్వర్య హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ బ్రెస్ట్ సెంటర్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చిన్మయి శ్రీపాద, రాజ సుందరం తదితరులు

అడయార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ ఆస్పత్రుల్లో ఒకటైన ఐశ్వర్య హాస్పిటల్ మహిళల ఆరోగ్య సంరక్షణకు తొలి ప్రాధాన్యతనిస్తూ, ఆరంభంలోనే బ్రెస్ట్ కేన్సర్‌ను గుర్తించేలా అడ్వాన్స్‌డ్ బ్రెస్ట్ సెంటర్ ప్రారంభించింది. ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద ముఖ్య అతిథిగా హాజరై ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల హక్కులు, శ్రేయస్సు గురించి బహిరంగంగా మాట్లాడే వ్యక్తిగా మహిళల బ్రెస్ట్ క్యాన్సర్‌పై ముందస్తు పరీక్షలు ఎంత ముఖ్యమో తనకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిట్ సీఈవో, అంకాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాజసుందరం మాట్లాడుతూ, భారతీయ మహిళల్లో ఇపుడు బ్రెస్ట్ క్యాన్సర్ సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. ప్రతి నలుగురిలో ఒకరికి ఈ సమస్య ఉందన్నారు. దీనికి కారణం సరైన అవగాహన లేకపోవడమేనన్నారు. ఈ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

కోలాహలంగా 'ది హెరిటేజ్ హంట్' కార్ల ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న నటుడు గణేష్ వెంకట్రామన్

పెరంబూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3233 ఆధ్వర్యంలో 'ది హెరిటేజ్ హంట్ కార్ల ర్యాలీ కోలాహలంగా సాగింది. ప్రపంచ శాంతి, రాజధాని నగరం చెన్నై ప్రాచీనత, ప్రాముఖ్యత తెలియజేసేలా 20 కి.మీ మేర ర్యాలీ నిర్వహించారు. వేళచ్చేరిలోని గురునానక్ కాలేజ్ ప్రాంగణం నుంచి ర్యాలీని సినీనటుడు గణేష్ వెంకట్రామన్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.దేవేంద్రన్, రోటరీ డిస్ట్రిక్ట్ 3233 డిస్ట్రిక్ట్ ఫస్ట్ లేడీ అర్చన దేవేంద్రన్, ర్యాలీ చైర్మెన్ లలిత శ్రీరామ్, ర్యాలీ కో-ఆర్డినేటర్ మీనా అళగు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో 150కి పైగా కార్లు పాల్గొనగా, అత్యధికంగా మహిళలు కారు డ్రైవర్లుగా వ్యవహరించడం గమనార్హం.

నేటినుంచి తిరువళ్లూర్ ప్రీమియర్ లీగ్ 3.0



తమిళనాడు హాకీ మస్కట్ లోగో ఆవిష్కరణ

అడయార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ ప్రీమియర్ లీగ్ 3.0 పోటీలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ పోటీలను పురస్కరించుకుని ఎగ్మోర్‌లోని మేయర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో తమిళనాడు హాకీ మస్కట్‌తో పాటు ప్రత్యేక గీతాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆగస్టు 11 నుంచి 31వ తేదీ వరకు ఈ పోటీలు రాధాకృష్ణన్ స్టేడియంలో ప్రతి రోజూ పూలింగ్ విధానంలో రెండు మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో భాగంగా సూపర్ సిక్స్, నాకౌట్ మ్యాచ్‌లుంటాయి. ఆ తర్వాత క్వాలిఫయర్ మ్యాచ్ 30న, ఫైనల్ మ్యాచ్ 31వ తేదీ నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ విషయాన్ని పోటీల నిర్వహణ కమిటీ డైరెక్టర్ మాలిని జీవరత్నం తదితరులు మీడియా సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో ఇండియన్ హాకీ కోచ్ సీఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వన్నియర్ల మహిళా మహానాడు



వర్షం కురవటంతో కార్యకర్తల వైపు ఆందోళనగా చూస్తున్న పీఎంకే నేత రాందాస్

అడయార్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):పీఎంకే అధ్యక్షుడు అన్బుమణితో పోటీపడేలా ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఆదివారం సాయంత్రం వన్నియార్ల మహిళా మహానాడును అట్టహాసంగా నిర్వహించారు. ప్రజాబలం తనవైపే ఉందని తనయుడికి చాటిచెప్పేలా ఈ మహానాడుకు వేలాదిమంది మహిళా కార్యకర్తలను తరలించారు. మైలాడుదురై జిల్లా సీర్గాళి సమీపంలోని పూంపుహార్ వద్ద మహానాడు జరిగింది. పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి, వన్నియర్ సంఘం అధ్యక్షుడు అరుల్‌మొళి, తంజావూరు జిల్లా కార్యదర్శి స్టాలిన్, మైలాడుదురై జిల్లా కార్యదర్శి భాగ్యం శక్తివేల్ తదితరులు హాజరయ్యారు. ఈ మహానాడుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వన్నియర్ సంఘ కార్యకర్తలు, నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అయితే గంట తరువాత కుండపోతగా వర్షం కురవటంతో ఆటంకం ఏర్పడింది. సమావేశానికి హాజరైనవారంతా తాము కూర్చున్న కుర్చీలను గొడుగుల్లా పట్టుకుని నిలిచారు.

ఆస్కా ట్రస్ట్ వైద్యశిబిరానికి అనూహ్య స్పందన



వైద్యశిబిరంలో వైద్యులతో ఆస్కా నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ట్రస్ట్ (ఆస్కా) ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. టి.నగర్‌లోని ఆస్కా ప్రాంగణంలో ఆస్కా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వేమిరెడ్డి కోటారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరాన్ని ఆస్కా అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, కార్యదర్శి దిలీప్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఎస్‌వీడీసీ అన్నానగర్ వైద్య బృందం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, దంత, నేత్రపరీక్షలు నిర్వహించారు. ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాగింది. ఉచిత వైద్యశిబిరంలో సుమారు 500 మంది పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అదేవిధంగా ఈ శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. ఆస్కా కార్యదర్శి పి.సంతోష్‌కుమార్, ట్రస్ట్ కోశాధికారి బీవీఎస్ కోటేశ్వరరావు, ఆస్కా ట్రస్టీలు విజయేంద్రరావు, ముంద్రు శ్రీనివాసరావు, వడ్లమాని బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి కోటారెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ఆస్కా ట్రస్ట్ తరుఫున ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామని, ఈ శిబిరంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు.



బీసెంట్‌నగర్ బీచ్‌లో సీఐఐ యంగ్‌ఇండియన్స్ ఆధ్వర్యంలో దివ్యాంగుల వాక్ అలాంగ్ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించి ఓ దివ్యాంగుడిని వీల్‌చెయిర్‌లో సముద్రతీరం దాకా తీసుకెళుతున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం.

కామరాజర్ పోర్ట్ ట్రస్ట్ సామాజిక సేవ

● తిరువళ్లూరు జిల్లాలోని 28 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు



డిజిటల్ క్లాసుల ప్రారంభోత్సవంలో కామరాజర్ పోర్ట్ ట్రస్ట్ ఎండీ ఐరిన్ సింధ్య, కరుప్పయ్య తదితరులు

ప్యారీస్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కామరాజర్ పోర్టు ట్రస్ట్ కేటాయించిన రూ.33.20 లక్షలతో తిరువళ్లూరు జిల్లాలోని 28 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్ ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పోర్ట్ ట్రస్ట్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. చెన్నై పోర్టు ట్రస్ట్ అనుబంధ సంస్థగా పనిచేస్తున్న కామరాజర్ పోర్టు ట్రస్ట్ ప్రతి ఏటా విద్య, సామాజిక సేవా కార్యక్రమాలకు ఆ సంస్థకు వచ్చే లాభాల నుండి సుమారు 2శాతాన్ని విరాళంగా అందజేస్తోంది. ఆ మేరకు తిరువళ్లూరు జిల్లా పొన్నేరి తాలూకా వల్లూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆదిద్రావిడ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కామరాజర్ పోర్టు ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ఐరిన్ సింధ్య ముఖ్యఅతిథిగా హాజరై డిజిటల్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్) ఎ.కరుప్పయ్య, పొన్నేరి ప్రత్యేక తాహసీల్దారు చిత్ర, పాఠశాల హెడ్మాస్టర్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవంబర్ నుంచి సెంట్రల్ - అరక్కోణం ఏసీ రైలు

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ సబర్బన్ నుండి అరక్కోణం వరకు ఏసీ విద్యుత్ లోకల్ రైలు నవంబర్‌లో పట్టాలపై పరుగులు తీయనుంది. బీచ్ నుంచి చెంగల్పట్టు మార్గంలో ప్రవేశపెట్టిన ఏసీ విద్యుత్ రైలు సేవలకు ప్రయాణికుల నుండి అనూహ్య స్పందన లభించింది. ప్రస్తుతం ఐసీఎఫ్‌లో కొత్త ఏసీ విద్యుత్ లోకల్ రైలు నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయి. బీచ్ - చెంగల్పట్టు మధ్య నడుపుతున్న ఏసీ విద్యుత్ లోకల్ రైలులో ఉన్న సదుపాయాలన్నీ ఈ రైలులో కూడా ఉంటాయని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఈ రైలులో మినిమం చార్జ్ రూ.35లుగా, గరిష్టంగా రూ.105లుగా ఉంటుందని పేర్కొన్నారు.

